సమావేశంలో మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

- **స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత 'హస్తం' దుకాణం బంద్**
- **కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడుతున్న జనం**
- **రైతుల నోట్లో మట్టి కొట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**
- **మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి**

నర్సంపేట, ఫిబ్రవరి 10: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు కనిపించరని, గతంలో ఏ ప్రభుత్వం ఎదుర్కోని ప్రజా వ్యతిరేకతను రేవంత్‌రెడ్డి సర్కారు చవిచూస్తున్నదని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాధ్యం కాని హామీలు ఇచ్చి, వాటిని అమలు చేయక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశాడని విమర్శించారు. నర్సంపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాల రైతులు ఏకకాలంలో నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు చెప్పారు. రైతు భరోసా, రుణమాఫీ పథకాలు అమలు చేయకుండా రైతుల నోట్లో కాంగ్రెస్ మట్టి కొట్టిందని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే సొంత కంపెనీకి మాత్రం బిల్లులు వస్తున్నాయని, రైతులకు మాత్రం బోనస్ డబ్బులు రావా అని ప్రశ్నించారు. గతంలో ఎన్నో నిరసనలు చూశామని, కానీ ఏకకాలంలో నర్సంపేట నియోజకవర్గంలోని 179 జీపీల్లో రైతులు రోడ్లపైకి వచ్చి శాంతియుతంగా నిరసన తెలిపారని గుర్తుచేశారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయకపోతే భవిష్యత్‌లో మరిన్ని నిరసన కార్యక్రమాలు ఉంటాయని హెచ్చరించారు.

రైతులకు బాకీ పడిన ప్రభుత్వం

సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నర్సంపేట నియోజకవర్గానికి రూ.158 కోట్ల రైతు భరోసా డబ్బులు బాకీ ఉన్నారని ఈ సందర్భంగా పెద్ది గుర్తు చేశారు. నియోజకవర్గంలో దాదాపు 16 వేల మందికి పైగా కూలీలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హులని, మిగిలిపోయిన రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతుబంధు సమితి రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నర్సంపేట పట్టణ, మండల అధ్యక్షులు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, నామాల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ నల్లా మనోహర్‌రెడ్డి, క్లస్టర్ బాధ్యుడు బండి రమేశ్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, యువజన సంఘం పట్టణ కార్యదర్శి వేణుచంద్, నాయకులు పాల్గొన్నారు.

నర్సంపేట: రామవరంలో నిరసన తెలుపుతున్న రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు

దుగ్గొండి: ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

నర్సంపేట: దాసరిపల్లిలో నిరసన తెలుపుతున్న రైతులు, నాయకులు

కాంగ్రెస్‌పై ఆగ్రహం

- **రైతు భరోసా, రుణమాఫీ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్**
- **కోతలు లేకుండా 24 గంటలూ విద్యుత్ సరఫరా చేయాలి**
- **అన్నదాతలకు వెంటనే బోనస్ చెల్లించాలి**
- **బీఆర్‌ఎస్ నాయకుల డిమాండ్**
- **నిరసనలో పాల్గొన్న రైతులు, కూలీలు**

నర్సంపేట, ఫిబ్రవరి 10: రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై గ్రామ గ్రామానా సోమవారం నిరసనలు మిన్నంటాయి. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పిలుపు మేరకు నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతులు, రైతు కూలీలు, నాయకులు ప్లకార్డులు చేతబూని నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. ఇందులో భాగంగా నర్సంపేట మండలంలోని రాజపల్లిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, ఇటుకాలపల్లిలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, మహేశ్వరంలో మాజీ ఎంపీపీ మోతె కళావతి, కమ్మపల్లిలో మాజీ జడ్పీటీసీ కోమాండ్ల జయ, రామవరంలో సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కొడారి రవన్న ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. గురిజాలలో రైతులు, నాయకులు పెద్ద ఎత్తున చౌరస్తాకు తరలివచ్చి ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. దాసరిపల్లి, ఇప్పల్‌తండా, కొండసముద్రంతండా, ముత్తోజిపేట, చిన్న గురిజాల, గుంటూరుపల్లి, జీజీఆర్‌పల్లి, రాములునాయక్‌తండా, ముగ్దుంపురం, మాదన్నపేట, నాగుర్లపల్లి, పర్శనాయక్ తండా, భాంజీపేట, భోజ్యానాయక్‌తండా, చంద్రయ్యపల్లి, రాజుపేట, గార్లగడ్డతండా, ఆకులతండా, నర్సింగాపురంలో పార్టీ గ్రామ అధ్యక్షుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారు..

ఖానాపురం: నర్సంపేట నియోజకవర్గానికి మంజూరైన వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని యథావిధిగా అమలు చేయాలని, వ్యవసాయానికి కోతలు లేని 24 గంటల కరెంటు సరఫరా చేయాలని, అన్ని గ్రామాల్లో అర్హులుగా గుర్తించిన వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని 21 గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ప్లకార్డులు చేతబూని నిరసన తెలిపారు. అశోక్‌నగర్‌లో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోత్ రామస్వామీనాయక్, ఖానాపురంలో మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, బుధరావుపేటలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహాలక్ష్మీ వెంకటనర్సయ్య, ధర్మారావుపేటలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. అలాగే, పెండింగ్‌లో ఉన్న సన్న ధాన్యం బోనస్‌ను రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విడిచిపెట్టేది లేదు

దుగ్గొండి: గత ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను అమలు చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విడిచిపెట్టేది లేదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు హెచ్చరించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ది పిలుపు మేరకు మండలంలోని 34 జీపీల్లో పార్టీ గ్రామ కమిటీల నేతృత్వంలో ప్లకార్డులు చేతబూని నిరసన తెలిపారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గ్రామాల్లో ఎండగట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, పొన్నం మొగిలి, కాట్ల కోమలా భద్రయ్య, నియోజకవర్గ యూత్ కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి కంచరకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, మేరుగు రాంబాబు, రేవూరి సురేందర్‌రెడ్డి, తోటకూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకిచ్చిన హామీలను నెరవేర్చాలి

చెన్నారావుపేట: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని బీఆర్‌ఎస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. పెద్ది పిలుపు మేరకు మండలవ్యాప్తంగా నిరసనలు తెలిపారు. షరతులు లేకుండా రూ. 2 లక్షల రుణమాఫీ పూర్తి చేయాలని, రైతు భరోసాలో ఎకరానికి రూ. 15 వేలు ఇవ్వాలని, సన్న వడ్లకు బోనస్ వెంటనే చెల్లించాలని, భూమి లేని రైతు కూలీలకు ఆత్మీయ భరోసా పథకంలో రూ. 12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పత్తినాయక్, బాల్నె వెంకన్న, కుండె మల్లయ్య, జున్నుతుల మహేందర్‌రెడ్డి, కంది కృష్ణచైతన్యరెడ్డి, రఫీ, విజయరామరాజు, మురహరి రవి, అమ్మ రాజేశ్, అనుముల కుమారస్వామి, సారంగపాణి, కడారి సాయిలు, మురళీనాయక్, విజేందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెల్లుబికిన నిరసనలు

నెక్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నెక్కొండ మండలవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. నెక్కొండలో బొడ్రాయి, హైస్కూల్ సెంటర్‌లో జరిగిన నిరసన కార్యక్రమాల్లో సొసైటీ చైర్మన్ మారం రాము, న్యాయవాది కొమ్ము రమేశ్‌యాదవ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కొణిజేటి భిక్షపతి, సొసైటీ మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, దేవనబోయిన వీరభద్రయ్య, తోట సాంబయ్య, కారింగుల సురేశ్, ఈదునూరి యాకయ్య పాల్గొని మాట్లాడారు. చంద్రుగొండలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మాజీ సర్పంచ్ బక్కి రాజమ్మ-సాంబయ్య, మాజీ ఉప సర్పంచ్ ఎర్ర సతీశ్, పార్టీ గ్రామ అధ్యక్షుడు సిరిపోతుల సురేశ్, బక్కి కుమారస్వామి పాల్గొన్నారు. అలంకానిపేటలో మాజీ సర్పంచ్ మాదాసు రవి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు చీకటి శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ సూరం రాజిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కర్పూరపు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుంటుక సోమయ్య పాల్గొన్నారు. రెడ్లవాడలో మాజీ సర్పంచ్ రావుల శ్రీలతా ప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

ఖానాపురం: అశోక్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న రైతులు, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, నాయకులు

చెన్నారావుపేట: అమీనాబాద్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, నెక్కొండ: మండలకేంద్రంలో పాల్గొన్న సొసైటీ చైర్మన్ రాము, బీఆర్‌ఎస్ శ్రేణులు, నర్సంపేట: ఇప్పల్‌తండాలో నిరసన తెలుపుతున్న రైతులు

రైల్వేగేట్ ఆర్వోబీకి మెట్లు నిర్మించరూ..

రైల్వేగేట్‌పై నిర్మించిన ఆర్వోబీ

కరీమాబాద్, ఫిబ్రవరి 10: వరంగల్ రైల్వేగేట్‌పై నిర్మించిన ఆర్వోబీకి మెట్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని పెరుకవాడ, శాంతినగర్ వాసులతోపాటు బాటసారులు కాలినడన రైల్వేగేట్ అవతలి ప్రాంతానికి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. బాటసారులు నడిచేందుకు వీలుగా గేటు ఇవతలి ప్రాంతంతోపాటు అవతలి వైపు మెట్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఆర్వోబీ ప్రారంభమై ఏండ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలోనే అధికారులు మెట్లు నిర్మిస్తామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ చూపి ఆర్వోబీకి మెట్లు నిర్మించి బాటసారుల కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

బీసీ పవర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా రాజు

నర్సంపేట, ఫిబ్రవరి 10: బీసీ పవర్ నియోజకవర్గ కార్మిక విభాగం ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన పొనగంటి రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం రాజుకు నియామక పత్రాన్ని బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోత్ రాజుయాదవ్, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు మోటం కన్నీ, మహిళా జిల్లా అధ్యక్షురాలు వరంగంటి కవిత, డివిజన్ అధ్యక్షురాలు గాదం స్వప్న, కార్మిక విభాగం డివిజన్ అధ్యక్షుడు బోయ రాజు అందజేశారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి: డీఎస్‌వో

గిర్మాజీపేట, ఫిబ్రవరి 10: విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్ సూచించారు. జిల్లా కేంద్రంలో ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జి.సాయివర్ధన్, నిశ్చల్ కార్తికేయ, ఏ సాయికిరణ్‌తోపాటు గైడ్ టీచర్లు రఘు, సత్యం, వెంకటరమణ, నళినికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు వెనిశెట్టి కృష్ణమూర్తి, కార్యదర్శి సందీప్‌రెడ్డి, ఫిజికల్ సైన్స్ ఫోరం బాధ్యులు వేణుకుమార్, అనంతగిరి, పిన్నింటి బాలాజీరావు, కిరణ్, సంతోష్‌కుమార్, విశ్వేశ్వర్, జోగయ్య పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలే అందజేస్తున్న డీఎస్‌వో శ్రీనివాస్

ఇద్దరికి తీవ్ర గాయాలు

నెక్కొండ, జనవరి 10: మండలంలోని పనికర శివారులో బైక్ అదుపు తప్పి పడిపోవడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. చెన్నారావుపేట మండలం ఎల్లయ్యగూడానికి చెందిన వేముల ఎల్లగౌడ్, బూరుగు కేశవులు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. దీంతో అంబులెన్స్‌లో నర్సంపేటలోని ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు 108 సిబ్బంది ఉపేందర్, శంకర్ తెలిపారు. అప్పల్‌రావుపేటలో జరిగిన శుభకార్యానికి హాజరై తిరిగి వస్తుండగా, పనికర శివారులో ఈ ఘటన జరిగింది.

కార్యకర్తల కుటుంబాలకు బీఆర్‌ఎస్ అండ

కరీమాబాద్, ఫిబ్రవరి10: ప్రతి కార్యకర్త కుటుంబానికి బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. వరంగల్ 39వ డివిజన్ ముఖ్య నాయకుడు బజ్జూరి వాసు తండ్రి వీరేశం(70) అనారోగ్యంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న నన్నపునేని సోమవారం దవాఖానకు చేరుకొని వీరేశంను పరామర్శించారు. అనంతరం బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట కుడా మాజీ సలహాదారు మేరుగు ప్రవీణ్, పొగాకు సందీప్ ఉన్నారు.

పొక్లెయిన్‌తో మక్కజొన్న పంటను తొలగించిన అధికారులు

బందోబస్తు మధ్య పంట చేన్ల తొలగింపు

పంట పూర్తయ్యాక పనులు చేపట్టాలని రైతుల వేడుకోలు

నెక్కొండ, జనవరి 10: మండలంలోని తోపనపల్లిలో గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను సోమవారం పోలీసు బందోబస్తు మధ్య అధికారులు చేపట్టారు. నర్సంపేట ఆర్డీవో ఉమారాణి ఆధ్వర్యంలో రెవెన్యూ యంత్రాంగం, ఏసీపీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా మక్కజొన్న, వరి చేన్లను పొక్లెయిన్లతో తొలగింపు చర్యలు చేపట్టారు. అయితే, పంట పూర్తయ్యాక రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని రైతులు అధికారులను వేడుకున్నారు. అవేమీ పట్టించుకోకుండా తమ పంటలను తొలగిస్తున్నారని రైతులు వాపోయారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతులతో సమావేశం

గీసుగొండ: మండలంలోని ఊకల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రీన్‌ఫీల్డ్‌లో భూములు కోల్పోతున్న రైతులతో సోమవారం ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి సమావేశమయ్యారు. రైతులకు నష్టపరిహారంతోపాటు బోర్లు, బావులకు కూడా పరిహారం అందిస్తామన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే వెంట సర్వీస్ రోడ్డు నిర్మాణంతోపాటు అండర్ పాసులు నిర్మిస్తారని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ రియాజుద్దీన్, ఆర్ఐ సాంబయ్య పాల్గొన్నారు.

31 కిలోల గంజాయి పట్టివేత

వివరాలు వెల్లడిస్తున్న పోలీస్ అధికారులు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 10: వరంగల్ రైల్వేస్టేషన్‌లోని ప్రధాన ద్వారం వద్ద గంజాయి తరలిస్తున్న ఇద్దరిని ఆర్పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం ఆర్పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ గురవయ్య, కానిస్టేబుల్ మనోజ్‌తోపాటు సీఐబీ కానిస్టేబుల్ సుర్జిత్‌కుమార్ వరంగల్ రైల్వేస్టేషన్‌లోని ప్రధాన ద్వారం వద్ద తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్రలోని ముంబైకి చెందిన రాహుల్ రాం లఖన్‌తివారీ(24), ఆశీష్ రమ్నాయక్ యాదవ్(20) అనుమానాస్పదంగా కనిపించారు. వెంటనే పోలీసులు వారి బ్యాగ్‌లను తనిఖీ చేశారు. అందులో 16 ప్యాకెట్లు లభించాయి. సుమారు రూ. 7.75 లక్షల విలువైన 31 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని, ఇద్దరు నిందితులను టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్‌కు అప్పగించినట్లు వారు వెల్లడించారు.

గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

గీసుగొండ: టెక్స్‌టైల్ పార్కులో గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మహేందర్ తెలిపారు. పార్కులో ముగ్గురు వ్యక్తులు గంజాయి చాక్లెట్స్ అమ్ముతున్నారని సమాచారం అందడంతో ఎస్సై ప్రశాంత్‌బాబు తన సిబ్బందితో కలిసి పార్కుకు వెళ్లారు. అక్కడ ముగ్గురు వ్యక్తులు ప్లాస్టిక్ కవర్లతో అనుమానాస్పదంగా కనిపించారు. వెంటనే వారిని పట్టుకొని విచారించగా, రూ. 1080 విలువైన 12 గంజాయి చాక్లెట్స్ లభించినట్లు తెలిపారు. పట్టుబడిన సన్నికుమార్(బీహార్), విక్కియాదవ్(ఉత్తరప్రదేశ్), షాభం విశ్వకర్మ(ది మధ్యప్రదేశ్) గణేశా ఈకోపేట్ పరిశ్రమలో ఆపరేటర్లుగా పని చేస్తున్నట్లు తెలిపారు. వీరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

రైలు వస్తేనే విధులకు హాజరు

- **కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో ప్రభుత్వ ఉద్యోగుల అప్ అండ్ డౌన్**
- **ట్రైన్ ఆలస్యంగా రావడంతో మండలంలోని కార్యాలయాలు వెలవెల**

నెక్కొండ, జనవరి 10: మండలకేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు సోమవారం వెలవెలబోయాయి. విధులకు హాజరు కావాల్సిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిత్యం వరంగల్, ఇతర ప్రాంతాల నుంచి కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలులో అప్ అండ్ డౌన్ చేస్తున్నారు. దీంతో కృష్ణా ఎక్స్‌ప్రెస్ వేళలే ఉద్యోగుల పనివేళలుగా మారిపోయాయి. ఈ క్రమంలో రైలు సోమవారం ఉదయం 11.30 గంటలకు ఆలస్యంగా చేరుకోగా, మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల హాజరు పలుచబడి కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. పోస్టుమాస్టర్ విధులకు ఆలస్యంగా హాజరు కాగా, ప్రజలు ఇబ్బంది పడ్డారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులు కానరాక కుర్చీలు ఖాళీగా కనిపించాయి. పశువైద్యశాలలో డాక్టర్ కోసం రైతులు నిరీక్షించారు. సెలవులో ఉన్నట్లు డాక్టర్ మమత తెలిపారు. ఇక రైలు ఆలస్యమైన ప్రతిసారి మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు లేటుగా వస్తుండడంతో ఇబ్బంది పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి పరిస్థితిని చక్కబెట్టాలని వారు కోరుతున్నారు.


ఉదయం 11.30 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

డాక్యుమెంట్ పోయినది
నేను, కేమిడి జయమ్మ W/o యాకయ్య, R/o గ్రా॥ లక్ష్మినారాయణపురం, మం॥ పాలకుర్తి, జి॥ జనగామ. మాయొక్క విస్నూరు గ్రామ వ్యవసాయ భూమి ఎ. 2-37 గుంటలు, సర్వే నెం. 605, 610, 612, ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నెం. 1243/2014 గత జనవరి 17న జనగామకు బ్యాంక్‌లోన్ పని నిమిత్తం పోయి వస్తుండగా పోయినది. దొరికినవారు దయచేసి సంప్ర: సెల్: 9347485283, 9182809036

BUILDING FOR SALE

★H.No: 2-6-75, Circuit House, Nakalgutta Hanamkonda, Ground floor Bldg, 160.7 Sq.yds, 1000 sqft RCC buildup area, East Facing, 1.15 Cr. Clear tittle, Brokers pls excuse. **Contact:** 9949912347, 999896 12347, 63025 53816.
NTW-332462

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

బ్యాంకులో షార్ట్ సర్క్యూట్

వర్ధన్నపేట, ఫిబ్రవరి 10: యూనియన్ బ్యాంకు ఇల్లంద శాఖలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో బ్యాంకులో ఉన్న ఏటీఎం పక్కన విద్యుత్ తీగల నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గుర్తించిన అధికారులు, సిబ్బంది, వినియోగదారులు వెంటనే కార్యాలయం నుంచి బయటకు పరుగులు తీశారు. గోడకు ఉన్న వైర్ల నుంచి మంటలు వచ్చినప్పటికీ ఆఫీస్‌లోకి వ్యాపించలేదు. స్థానికులు, బ్యాంకు సిబ్బంది వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చి సరఫరాను నిలిపివేశారు. షార్ట్ సర్క్యూట్ వల్ల బ్యాంకుకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బ్యాంకులో ఎలాంటి నష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ముక్కిపోతున్న రేషన్ బియ్యం

కాశీబుగ్గ, ఫిబ్రవరి 10: జిల్లాలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని కొన్ని రోజులుగా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యాన్ని ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలోని వరంగల్ పీడీఎస్ గోదాంలో నిల్వ చేశారు. 2022 నుంచి ఇప్పటి వరకు వంద క్వింటాళ్లను ఒక చోట నిల్వ చేశారు. వాటిని రేషన్ షాపులకు పంపించకపోవడంతో ముక్కిపోతున్నట్లు తెలుస్తున్నది. మరికొన్ని రోజులైతే బియ్యం పూర్తిగా పాడయ్యే అవకాశం ఉన్నట్లు అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

మూడేళ్ల నుంచి నిల్వ ఉన్న పట్టుబడిన రేషన్ బియ్యం

ఫ్లెక్సీ తొలగించరూ..

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 10: పోచమ్మమైదాన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ సిబ్బంది తొలగించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగల పేరుతో ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ రాజకీయ పార్టీల నాయకులు తమ పేరున సెంటర్‌లో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. పండుగలు అయిపోయి నెల రోజులు దాటినా ఫ్లెక్సీని అలాగే ఉంచడం ఏంటనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. బల్దియా సిబ్బంది ఫ్లెక్సీని తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పోచమ్మమైదాన్ సెంటర్‌లో నెల రోజుల నుంచి ఉన్న కాంగ్రెస్ నాయకుల ఫ్లెక్సీ

వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి

నర్సంపేట, ఫిబ్రవరి 10: పట్టణంలోని అన్ని రకాల వ్యాపారులు ఆన్‌లైన్‌లో కొత్తగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.నాగరాజు సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన వివిధ వర్తక, వాణిజ్య వ్యాపారుల యూనియన్ అధ్యక్షులతో ట్రేడ్ లైసెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. నర్సంపేట మున్సిపల్ పరిధిలో వ్యాపారం చేస్తున్న వారు ఆన్‌లైన్‌లో నూతన ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. ఇప్పటికే తీసుకున్న వారు రెన్యువల్ చేసుకోవాలన్నారు. వారం రోజుల్లో లైసెన్స్ పొందకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధిత కుటుంబాలకు ఎర్రబెల్లి పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎర్రబెల్లి

రాయపర్తి, ఫిబ్రవరి 10: మండలంలోని పలు గ్రామాల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సోమవారం పర్యటించారు. మైలారంలో గుండెపోటుతో మృతి చెందిన గూడెల్లి వెంకన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మొరిపిరాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు పొరుపల్లి సుధాకర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆయనను పరామర్శించారు. లెక్కల మాధవరెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి: డీఎంహెచ్‌వో

రోగుల సమస్యలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

నర్సంపేట, ఫిబ్రవరి 10: వైద్య సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు సూచించారు. భాంజీపేట పీహెచ్‌సీ, పట్టణంలోని టీ-హబ్, ఫైలిటీ కేర్ సెంటర్లను సోమవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, రోగులకు అందుతున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. మాతాశిశు సంరక్షణ, ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. ఆయన వెంట డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ శ్రావణ్‌కుమార్, డెమో అనిల్‌కుమార్, వైద్య సిబ్బంది ఉన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రాయపర్తి, ఫిబ్రవరి 10: రాష్ట్రవ్యాప్తంగా కల్లుగీత కార్మిక కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సంఘం మండలాధ్యక్షుడు పులి సోమయ్యగౌడ్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని అంగడి మైదానంలో సోమవారం జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్లు గీత కార్మికులకు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సేఫ్టీ మోకులు, అర్హులకు పింఛన్లు అందించాలని కోరారు. నాయకులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

వర్ధన్నపేట, ఫిబ్రవరి 10: రైతులు కేవలం వాణిజ్య పంటలు, వరిపైనే ఆధారపడకుండా ఆయిల్‌పామ్ సాగు చేపడితే లాభదాయకంగా ఉంటుందని ఉద్యాన శాఖ ఫీల్డ్ అధికారి దేవరాజు సూచించారు. మండలంలో సాగైన ఆయిల్‌పామ్ తోటలు కాత దశకు చేరుకున్నందున రోజువారీగా తోటలను సందర్శించి రైతులకు సూచనలు చేస్తున్నారు. సోమవారం నల్లబెల్లి గ్రామ సమీపంలోని శామంతుల సాంబయ్య సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటను సందర్శించి సూచనలు చేశారు. పంట క్షేత్రాలు ప్రస్తుతం పరాగ సంపర్క దశలో ఉన్నందున రైతులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శాఖ అధికారులు నారాయణ, షరీఫ్, రైతులు పాల్గొన్నారు.

రైతులకు సూచనలు చేస్తున్న అధికారులు